# అమ్మ

- డి.కె.చదువులబాబు

**"అ...అమ్మా...అ...మ్మా..."**

**ప్రకాష్‌కు అమ్మను చూడాలనిపిస్తోంది. అమ్మను చూడాలని అతను చాలాసార్లు అనుకున్నాడు. అనేక సమస్యలు, ఆర్థిక పరిస్థితులు, పనుల ఒత్తిడితో వెళ్ళలేకపోయాడు.**

"సరితా! అమ్మను చూసి తీసుకురావాలనిపిస్తోంది" భార్యతో చెప్పాడు.

"చాలారోజుల నుంచి చెబుతున్నారుగా. వీలు చూసుకుని వెళ్లిరండి" చెప్పింది సరిత.

ప్రకాష్ అమ్మను గురించి పెళ్లయిన నాటినుంచి సరితకు చెబుతున్నాడు. అమ్మతో పెనవేసుకున్న తన చిన్ననాటి జ్ఞాపకాలెన్నో సరితతో చెప్పాడు. అలా చెబుతున్నప్పుడు అతని ముఖంలో వర్ణించ లేని మధురభావన కదలాడుతూ ఉంటుంది.

తన భర్త అంతగా తల్చుకునే ఆమెను చూడా లని సరితక్కూడా ఉంది. అమ్మ అంటే ఆమె అతని కన్నతల్లికాదు. అలాగని పెంచిన తల్లీకాదు. ప్రకాష్ చిన్ననాటి స్నేహితుడు చక్రిగాడికి అమ్మ. ఆమె పేరు జానకమ్మ. చక్రధర్‌ను చిన్నప్పుడు ప్రకాష్ చక్రిగాడనీ పిలిచేవాడు. పక్క ఇల్లేవారిది.

ప్రకాష్ తల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి జీతం డబ్బు సగం తాగుడుకే సరిపోయేది. అతడి తాగుడు వ్యసనం తెల్సి మళ్ళీ పిల్లనెవరూ ఇవ్వ లేదు. స్వయంగా చేతులు కాల్చుకునేవాడు. పగ లంతా బాగా ఉండేవాడు. రాత్రయితే చాలు మందు తలమీద కూడా పోసుకునేవాడు.

అలా తాగిచ్చి ప్రకాష్ తాగొద్దని చెబితే కొట్టే వాడు. అలాంటప్పుడు జానకమ్మ అడ్డుపడి "ఒరే గుర్నాథం! నీకు బుద్ధిలేదురా. పీకల్దాకా తాగొచ్చి పిల్లాడి ప్రాణం తీస్తావేంట్రా. తాగొద్దని చెప్పం తప్పా. మనిషన్నాక బుద్ధి, జ్ఞానం ఉండాలి" అంటూ చెడామడా దులిపేసేది.

"అదికాదక్కా..." అంటూ ఏదో చెప్పబోయే తండ్రిని నోరు తెరవనిచ్చేదికాదు. ఆమె నోటికి భయపడే చీటికీ మాటికీ ప్రకాష్ మీద చెయ్యి చేసు కునేవాడు కాదు. చిన్ననాటి జ్ఞాపకాలు ప్రకాష్‌ని చుట్టుముడుతున్నాయి.

* * *

చక్రిగాడికి అన్నం పెడుతూ అమ్మ తనను కూడా పిలిచేది. ఇంటి మీదకు తీసుకెళ్ళి చందమా మను, చుక్కల్ని చూపిస్తూ చల్లని వెన్నెల్లో కమ్మని కథలు చెబుతూ గోరుముద్దలు తినిపించేది.

చక్రిగాడితో ఆటలాడుతూ తననూ పిలిచేది. అమ్మ దాగుడు మూతలు కట్టుకుని వెదుకుతతుంటే తప్పించుకుంటూ చుట్టూ తిరగడం ఎంత థ్రిల్లిం గ్గా ఉండేదో. దాగుడుమూతలు, కుంటాట, ఒత్తొత్తి వారొత్తి, ఛుక్...ఛుక్ పుల్ల...చాలా ఆటలు ఆడిం చేది. వెన్నెల్లో ఇసుక కుప్పల మీద కూర్చొని చక్రిగా డికి, తనకి కోటలు కట్టడం నేర్పింది అమ్మనే.

ఒక్కో జ్ఞాపకం ప్రకాష్ మనసును చిరుగాలిలా చుట్టుముడుతోంది. ఆ రోజులు..అమ్మ రూపం... చక్రిగాడు.. కళ్లముందు మెదులుతున్నారు. తండ్రి ట్రాన్స్‌ఫర్ తనను ఎంతో దూరం తీసుకొచ్చింది. అమ్మను, చక్రిగాడిని దూరం చేసింది.

"సరితా! రేపే వెళ్ళి అమ్మను తీసుకొస్తా! కనీసం ఆరునెలలైనా అమ్మను మన దగ్గర ఉంచుకోవాల నుంది" చెప్పాడు ప్రకాష్.

"వెళ్ళిరండి. నాకూ మీ అమ్మను చూడాలని ఉంది"

తెల్లారగానే ప్రయాణమై బయలుదేరాడు. ట్రైన్‌లో కిటికీ దగ్గర కూర్చున్నాడు. చిరుగాలి అమ్మ స్పర్శలా వచ్చి తాకుతోంది. ట్రైన్ మెల్లగా ముందుకు కదిలింది. మనసు డైరీ విప్పాడు. పది లంగా ఉన్న ఒక్కో జ్ఞాపకం పేజీ ఎగిరెగిరిపడు తోంది.

వాడితో పాటూ అప్పుడప్పుడూ అమ్మ స్నానం చేయించేది. తల దువ్వేది. అమ్మ పెట్టే గోరింటాకు, చేతికి కట్టే దేవుని దారాలు, కొంచెం నలతగా ఉంటే తీసే అగ్గి దిష్టి, పొరక దిష్టి, అన్నం దిష్టి.అన్నీ తనకి గుర్తే. ఆరోజు తనకు బాగా గుర్తు.

వారం రోజుల నుండి పరీక్ష ఫీజు కట్టమని నాన్నతో చెబుతూనే ఉన్నాడు తను. ఏరోజుకారోజు వాయిదా వేసేవాడు. ఆఖరు రోజు వచ్చేసింది. పరీ క్షలు రాయలేకపోతున్నందుకు చాలా బాధేసింది. అన్నిట్లో క్లాస్ ఫస్ట్ తానే. రోజూ చక్రిగాడింటికెళ్ళి చదువుకునేవాడు. అమ్మ తన పని చేసుకుంటూ చదివించేది. చక్రిగాడికి అర్థం కానివి తానే చెప్పే వాడు. వాడికి అక్కడ తానే గురువు. పరీక్షలు రాయ నందుకు చదవడమెందుకని ఆరోజు వెళ్లలేదు.

అమ్మ తన దగ్గరకొచ్చింది "ఏరా చిన్నా! ఈరోజు రాలేదు. పరీక్షలు దగ్గర్లో ఉన్నాయి కదా!" అంది. పలకలేదు తను.

"ఏంట్రా అలా ఉన్నావు. నలతగా ఉందా?" అని నుదుటిపై చేయి వేసింది. దుఃఖం కట్టలు తెంచుకుంది.

వెక్కి వెక్కి ఏడుస్తూ విషయం చెప్పాడు తను.

"ఇన్నాళ్ళూ నాతో చెప్పలేదేమిట్రా! రేపుకదా ఆఖరురోజు. నే కడతాలే..రా!" అంటూ పుస్తకాలతో పిల్చుకెళ్లింది.

తాను చదువుకుని తిరిగొచ్చే వేళకు నాన్న తాగి మంచం పై పడుకున్నాడు.

తెల్లారగానే ఫ్రెష్‌గా తయారై బ్యాగ్ తగిలించు కుని అమ్మ దగ్గరకెళ్లాడు. అమ్మ తనతో కలిసి బయ లుదేరింది. దారిలో షాపు దగ్గర ఆగింది. చేతిలోని సంచి నుండి పట్టుచీర తీసింది. ఆ చీర కుదువ బెట్టి డబ్బులు తీసుకుంది. చిరునవ్వుతో తన వెంట వచ్చి ఫీజు కట్టింది. తాను బాధపడుతూంటే...

"చీరదేముందిలే. ఓ పదిరోజుల్లో డబ్బు కట్టి తీసుకుంటాగా! ఈరోజు నుంచి బాగా చదవాలి" అంది. అలా..అలా... ఎన్నెన్ని జ్ఞాపకాలో.

ఆలోచిస్తూ నిద్రాదేవి ఒడిలోకి చేరుకున్నాడు.

* * *

ఒక్కో అడుగువేస్తూ ఊళ్ళోకి నడుస్తున్నాడు ప్రకాష్. అతని మనసులో అణువణువూ అమ్మను, చక్రధర్‌ను చూడడం కోసం ఆరాటపడుతోంది. ఊరు అప్పటికీ, ఇప్పటికీ చాలా మారిపోయింది. కొంతదూరం నడిచాడు. తానున్న ఇంటి స్థానంలో పెద్ద బిల్డింగ్ ఉంది. అక్కడ ఓ పెద్ద మనిషిని అడి గాడు.

"వాళ్లిప్పుడు ఇక్కడ లేరు. స్థలం బాగా ధర పలకడంతో అమ్ముకుని ఊరి చివర కాలనీలో స్థలం కొని బిల్డింగ్ కట్టారు" చెప్పాడు ముసలాయన.

ప్రకాష్ కాలనీ చేరుకున్నాడు. ఇద్దరు ముగ్గుర్ని అడిగి ఇల్లు కనుక్కున్నాడు. ఇంటిముందే ఎదురొ చ్చాడు చక్రి. ప్రకాష్‌ను చూడగానే గుర్తుపట్టి ఆనం దంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. నాలుగు గదుల ఇల్లు. విశాలంగా, చక్కగా ఉంది. ప్రకాష్

కళ్ళు అమ్మ కోసం ఆత్రంగా వెదికాయి.

"శ్యామలా! శ్యామలా" పిలిచాడు చక్రధర్.

చక్రధర్ భార్య హాల్లోకొచ్చింది.

"వీడు చిన్ననాటి క్లోజ్‌ఫ్రెండ్ ప్రకాష్. మన పెళ్ళికి వెడ్డింగ్ కార్డు కూడా పంపాను. రాలేకపోయాడు" భార్యకు పరిచయం చేశాడు.

ప్రకాష్ కాళ్ళు, ముఖం కడుక్కుని వచ్చి-

"చక్రీ...అమ్మేది?"అని అడిగాడు.

చక్రధర్ ముఖంలో కలవరపాటు. పలకలేదు.

"ఏంట్రా! అమ్మకేమైంది?" ఆందోళన, ఆతృత కలబోసుకున్న స్వరంతో అడిగాడు.

చక్రధర్ తడబడుతూ చెప్పాడు "అమ్మ ఓల్డేజ్



హోంలో ఉంటోందిరా!"

ప్రకాష్ నిర్విణ్ణుడయ్యాడు. విషయం అర్థమైంది. చాలామంది కొడుకుల జాబితాలోకే చక్రధర్ చేరిపోయాడన్నమాట.

ఉద్యోగం... ఆర్థికస్థోమత... పుట్టుక... అన్నీ వాడికి అమ్మ పెట్టిన భిక్షకాదా! ప్రతిదానికీ అమ్మ కొంగు పట్టుకు తిరిగే చక్రిగాడు కళ్ళముందు మెదిలాడు. ప్రకాష్, చక్రధర్‌కు, శ్యామలకు అమ్మ విలువ గురించి చెప్పదల్చుకోలేదు. అమ్మ ప్రేమను శ్వాసగా చేసుకుని పెరిగినవాడికి తల్లి గొప్పతనం గురించి ఏమని చెబుతాడు?

'అమ్మను తనవెంట తీసుకెళ్ళాలి శాశ్వతంగా' పదేపదే అనుకున్నాడు.

"అమ్మను చూడాలని ఉందిరా! ఈరోజు ఇంటికి తీసుకురా?" చెప్పాడు ప్రకాష్.

చక్రధర్ ఏదో చెప్పబోయాడు. "నువ్వేమీ చెప్పొద్దు. ఈరోజు అమ్మను తెస్తున్నావ్. అంతే..." అన్నాడు ప్రకాష్. ఇద్దరూ కబుర్లలో పడ్డారు. ప్రకాష్, చక్రధర్‌కి చిన్ననాటి విషయాలు గుర్తుచేశాడు. ప్రతి జ్ఞాపకం అమ్మతో ముడిపడి ఉన్నదే. చక్రధర్ సిగ్గుతో కుచించుకుపోతున్నాడు.

* * *

సాయంకాలం అమ్మను తీసుకొచ్చాడు చక్రధర్. అమ్మను చూడగానే ప్రకాష్ కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. అమ్మలో వయసు తెచ్చిన మార్పు స్పష్టంగా కన్పిస్తోంది. తల నెరిసి ఉంది. దగ్గరకెళ్ళి పాదాలకు నమస్కరించాడు.

"అ...అమ్మా...నేనమ్మా... ప్రకాష్‌ని...నీ చిన్నాని" చెప్పాడు ఉద్వేగంగా. "ఎలా ఉన్నావ్‌రా చిన్నా?" అమ్మ కళ్లలో అదే ఆప్యాయత.

"నీ దయ వల్ల బావున్నానమ్మా. ఉద్యోగం సంపాదించుకున్నాను. పెళ్ళి కూడా అనుకోకుండా జరిగిపోయింది. కబురంపే వీల్లేదు. ఎన్నోసార్లు రావాలనుకుంటున్నా పరిస్థితులు కలిసిరాక రాలేకపోయాను. నాన్న అనారోగ్యంతో ఈమధ్యనే కాలం చేశారు" చెప్పాడు ప్రకాష్.

"కూర్చోరా కన్నా..." అంటూ తాను కూర్చుంటూ కుర్చీ చూపించింది. అమ్మ ఎదురుగా కూర్చున్నాడు ప్రకాష్.

"చిన్నప్పుడు నువ్వు పంచిన ప్రేమకు కృతజ్ఞుడనమ్మా" అన్నాడు.

చక్రధర్. శ్యామల వారి సంభాషణ వింటుండిపోయారు.

"అ...అమ్మా...నిన్ను నాతో తీసుకెళ్లడానికి వచ్చానమ్మా. శాశ్వతంగా నువ్వు నాతో ఉందువుగానీ. రేపే మన ప్రయాణం" చెప్పాడు ప్రకాష్.

అతని ఆప్యాయత ధాటికి తట్టుకోలేక ఆమె నేత్రాలు అశ్రువాహినులే అయ్యాయి.

"నేను నీ వెంట రాలేనురా చిన్నా.." తడబడింది అమ్మ స్వరం. అయోమయంగా చూశాడు ప్రకాష్. అతనిలో కలవరపాటు.

"ఏమ్మా! ఎందుకని నేను నీ కొడుకని కాదా?" చిన్నప్పుడు నువ్వు పెట్టిన తిండి ఆడించిన ఆటలు, చెప్పిన కథలు, చదివించిన చదువు, పట్టుచీర కుదువపెట్టి కట్టిన ఫీజు, నీ ఆప్యాయతా ఎలా మరువనమ్మా. నిన్ను నా కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటాను. కాదనకమ్మా. రేపు వెళ్దాం" చేతులు జోడించాడు.

"నన్ను క్షమించరా చిన్నా! నీ వెంట నేను రాలేను. అంతకుమించి ఏమీ చెప్పలేనురా" అంది అమ్మ. అడిగి అడిగి అతని గొంతు దుఃఖంతో రుద్ధమైంది.

అమ్మ మనసు మౌనంగా రోదిస్తోంది.

"ఒరే చిన్నా! చిన్నప్పుడు చక్రిగాడు అన్నం తినకుండా మారాం చేస్తుంటే తోడు కోసం నిన్ను పిల్చుకుని ఓ ముద్ద నీకు పెట్టి, నాలుగు ముద్దలు వాడికి పెట్టేదాన్ని. కథలు చెప్పడం, ఆటలు ఆడించడం, గోరింటాకు పెట్టడం, తలదువ్వడం అన్నీ చక్రిగాడి కోసమే చేశాను. నువ్వు తోడుంటేనే వాడు చదువుకుంటాడు. వాడికి తెలియని ఇంగ్లీషు, లెక్కలు నువ్వు చెప్పేవాడివి. చక్రిగాడి చదువు చెడకూడదని చీర కుదువపెట్టి నీ ఫీజు కట్టానురా! నీ కోసం నే చేసిందంటూ ప్రత్యేకంగా ఏం లేదు. చక్రిగాడి కోసం స్వార్థంతో నిన్ను దగ్గరికి తీశాను. ఏ అర్హతతో నేను నీ వెంట రాను? ఈ అమ్మను క్షమించరా చిన్నా!" మౌనరోదనతో లేచి నిల్చుంది. ప్రకాష్ వైపు కన్నీళ్లతో చూసింది.

వెళిపోతోంది అమ్మ. ఆశ్రమం వైపు ఆమె అడుగులు కదిలిపోతున్నాయి. అయోమయంగా కన్నీళ్లతో చూస్తూండిపోయాడు ప్రకాష్.

★